సాక్షి
తిరుపతి
గురువారం । 13 । ఏప్రిల్ । 2023



అయ్యోర్లమయ్యాం!

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో డీఎస్సీ-98 క్వాలిఫైడ్ అభ్యర్థుల్లో 335 మందికి కోరుకున్న ప్రాంతాలకు డీఈవో నియామకపత్రాలను అందజేశారు.

- 8లో



భూమి ఆరోగ్యంతోనే సౌభాగ్యం

వ్యవసాయ భూములు ఆరోగ్యంగా ఉన్నప్పుడే మంచి దిగుబడులు, ఆదాయం వస్తుందని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు.

-8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	40	22
తిరుమల	36	19
చిత్తూరు	39	22
గూడూరు	41	24
నగరి	41	23

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం(సా)	సహర్ శుక్రవారం(ఉ)
తిరుపతి	6.29	4.40
చిత్తూరు	6.31	4.40
పుంగనూరు	6.32	4.44

బ్రాండ్.. బ్యాండ్

■ నా పేరు లింగమయ్య. మాది గుంటూరు జిల్లా గురజాల. మా బియ్యం బ్రాండ్ పేరు శ్రీఆహార్. శ్రీ(ఎస్ఆర్ఐ) అని ఉంటుంది. బస్తాపై నా పేరు, ఫొటో, అడ్రస్ ఉంటుంది. సీల్ బస్తా. మా బియ్యం బస్తాలానే నకిలీ ఉంది. ఆ బస్తాపైన శ్రీ (ఎస్ఆర్ఈఈ) అని ఉంటుంది. బస్తాని కుట్టి ఉంటారు. నకిలీ బస్తాపై అడ్రస్, పేరు, ఫోటో ఉండవు. వినియోగదారులు వీటిని గమనించి కొనుగోలు చేస్తే మోసపోయేందుకు వీలు లేదు.

■ మా బియ్యం బ్రాండ్ పేరు సత్యసాయి. నా పేరు సురేంద్ర, సూళ్లూరుపేట. మా బస్తాలో బియ్యం 26.70 కిలోలు ఉంటాయి. మా బ్రాండ్ పేరును అటూ ఇటు మార్చి బ్యాగ్‌ను తయారుచేసి అందులో తక్కువ క్వాలిటీ ఉన్న బియ్యాన్ని నింపి అమ్మేస్తున్నారు. మేము వ్యాపారం పెంచుకునేందుకు ఊరూరా తిరిగి విక్రయిస్తుంటే.. నకిలీలు బయటపడుతున్నాయి. ఏ ఒక్కరు ప్రభుత్వానికి ట్యాక్స్ కట్టడం లేదు.

జిల్లాలో నకిలీ బ్రాండెడ్ బియ్యం వ్యాపారం జోరుగా సాగుతోంది. బ్రాండెడ్ బియ్యం పేరుతో నకిలీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. నకిలీ వ్యాపారుల బ్యాగులన్నీ కూడా 26 కిలోల పైనే ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాకు లారీల్లో పరిమితికి మించి బియ్యాన్ని తీసుకొస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. వీటికి బిల్లులు ఉండవు. బరువు వేయరు. సెస్ చెల్లించారా? లేదా? అని కూడా చెక్ చేయడం లేదు. ఇటు వినియోగదారులు.. అటు ప్రభుత్వాన్ని మోసం చేస్తూ అక్రమార్కులు రూ.కోట్లు దండుకుంటున్నారు.



- బ్రాండెడ్ బియ్యం పేరుతో నకిలీలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- వినియోగదారునికి బిల్లు ఇవ్వరు
- జీఎస్టీ చెల్లించరు.. మార్కెట్ ట్యాక్స్ కట్టరు
- ఒక్క తిరుపతి జిల్లా నుంచే రూ.15 కోట్లు గండి
- మామూళ్ల మత్తులో అధికారులు

సాక్షి, తిరుపతి : జిల్లాలో నకిలీ బ్రాండ్ బియ్యం వ్యాపారం అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. దుకాణాలు, బ్రాండ్ పేర్లకు ఎలాంటి రిజిస్ట్రేషన్లు లేకుండా బియ్యాన్ని మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. జీఎస్టీ, వ్యవసాయ మార్కెట్ సెస్ వంటివి చెల్లించాల్సి ఉన్నా.. అటువంటివేమీ చెల్లించకుండా క్రయ విక్రయాలు జరుపుతూ వినియోగ దారులను మోసం చేస్తూ.. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. జిల్లాలో రూ.కోట్లలో జరిగే బియ్యం వ్యాపారంలో ప్రభుత్వానికి జీఎస్టీ,



మార్కెట్ చెస్ కట్టేవారు కేవలం ఆరుగురు మాత్రమే ఉన్నట్లు సమాచారం. మరో 40 మందికిపైగా నిబంధనలకు విరుద్ధంగా బియ్యం వ్యాపారాలు సాగిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 45 రైస్ మిల్లులు ఉన్నాయి. వీటిని నమ్ముకుని 7వేలకు పైగా బియ్యం దుకాణాలు వెలిశాయి. ఇవి కాకుండా నివాసాల్లో విక్రయించేవారు ఉన్నారు.

రోజుకు రూ.15 కోట్ల వ్యాపారం

తిరుపతి నగరంలోనే రోజుకు రూ.15 కోట్లు బియ్యం వ్యాపారం జరుగుతోంది. రోజుకు ఐదు లారీల బియ్యం వస్తోంది. అంటే 5వేల నుంచి 10వేల బస్తాలు. తిరుపతి మినహా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చూస్తే మరో రూ.20 కోట్ల వరకు బియ్యం క్రయ విక్రయాలు జరుగుతున్నట్లు అంచనా. ఎటువంటి బిల్లులు లేకుండా.. బియ్యాన్ని దిగుమతి చేయడం, ఆ తరువాత బస్తాలకు నింపి దుకాణాలకు తరలించడం షారా మమూలే. వీరు జీఎస్టీ 5శాతం, మార్కెట్ సెస్ ఒక శాతం ఎగ్గొట్టి క్రయ విక్రయాలు సాగిస్తున్నారు. నిబంధనల మేరకు నడుచుకునేవారు కేవలం నలుగురు వ్యాపారులు మాత్రమేనని తెలిసింది. ఒక్క తిరుపతి జిల్లా నుంచి నెలకు రూ.15 కోట్ల వరకు ప్రభుత్వ ఆదాయానికి గండిపడితున్నట్లు అధికారుల అంచనా. తిరుపతి నగరంలోని 50మంది దుకాణ దారులు రోజుకు రూ.50 లక్షలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉన్నా.. చెల్లించడం లేదని సమాచారం. ఇతర ప్రాంతాల నుంచి లారీల్లో పరిమితికి మించి బియ్యాన్ని తీసుకొస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కొందరు అధికారులు మామూళ్ల మత్తులో చూసీ చూడనట్లు పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

రెవెన్యూలో ఐదుగురు బదిలీ

తిరుపతి అర్బన్: జిల్లా రెవెన్యూ విభాగంలో ఐదుగురు బదిలీ అయ్యారు. శ్రీకాళహస్తి తహశీల్దార్ షేక్ జరీనా కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో అక్కడే డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఎం.రూప్ చంద్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చారు. శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయ ఏవో శ్రీదేవిని సత్యవేడుకు, అక్కడ తహశీల్దార్ టీవీ సుబ్రమణ్యంను బుచ్చినాయుడుకండ్రిగకు బదిలీ చేశారు. చిట్టమూరు తహశీల్దార్‌గా పనిచేస్తు సెలవులో ఉన్న మునిలక్ష్మిని శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయ ఏవోగా నియమిస్తూ కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

15న శ్రీసిటీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు



వివరాలను వెల్లడిస్తున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (తిరుపతి జిల్లా) ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన శ్రీసిటీలోని కంపెనీల్లో ఉద్యోగాల భర్తీకి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ తిరుపతి జిల్లా అధికారులతో ఆయనకు ఉద్యోగాల వివరాలపై చర్చించారు. పదవ తరగతి, ఇంటర్మీ డియెట్, డిప్లొమో, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన యువకులు, మహిళలు అర్హులని, క్వాలిఫికేషన్స్‌ను బట్టి జీతం ఉంటుందన్నారు. వివరాలకు 9032637478 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

సీహెచ్‌సీ గ్రూపులకు దరఖాస్తులు



ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి

తిరుపతి అర్బన్: ట్రాక్టర్లు, వరికోత యంత్రాలు, ఇతర వ్యవసాయ పరికరాలు రాయితీలతో పొందేందుకు రైతులు వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో సీహెచ్‌సీ(కస్టమ్ హైరింగ్ కేంద్రాలు) గ్రూపులను ఏర్పాటు చేసుకోవాలని జిల్లా వ్యవ సాయశాఖ అధికారి ప్రసాద్‌రావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో 180 సీహెచ్‌సీ గ్రూపుల రైతులకు ట్రాక్టర్లు, వరికోత యంత్రాలు, ఇతర పరికరాలు 40శాతం సబ్సిడీతో అందించామని చెప్పారు. అదే పద్ధతిలో మే మొదటి వారంలో రెండో విడత 137 సీహెచ్‌సీ గ్రూపుల ఏర్పాటుకు నిర్ణయించామని చెప్పారు. ఇప్పటికే 112 గ్రూపులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరో 25 గ్రూపులను ఏర్పాటు చేయాల్సి ఉందని వివరిం చారు. ఐదు నుంచి పది మంది రైతులు గ్రూపుగా ఏర్పాటు అయ్యేందుకు ఆయా పరిధిలోని ఆర్‌బీకేల్లో సంప్రదించవచ్చని తెలిపారు.

కాలుష్య నివారణలో తాబేళ్లే కీలకం



తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి వదులుతున్న అధికారులు

చిల్లకూరు : సముద్ర జలాలు కాలుష్యం బారిన పడకుండా నివారించడంలో తాబేళ్లు కీలకంగా వ్యవహరిస్తున్నాయని తిరుపతి అటవీశాఖా జిల్లా అధికారి సతీష్‌రెడ్డి తెలిపారు. చిల్లకూరు మండలం తమ్మినపట్నం సమీపంలోని తీగపాళెం సముద్రం వద్ద సముద్ర గస్తీ దళంతో బుధవారం 316 ఆలీవ్ రిడ్లే తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి వదిలారు. ఆయన మాట్లాడుతూ తాబేళ్ల గుడ్లను భద్ర పరి చి అవి పిల్లలు పెట్టే వరకు సంరక్షించి సముద్రంలోకి వదలుతున్నామని తెలిపారు. సూర్యు ని లేత కిరణాలంటే తాబేళ్ల పిల్లలకు ఎంతో ఇష్టమని, దీంతో సూర్యోదయ సమయంలో వదులుతున్నట్లు తెలిపారు. సబ్ డీఎఫ్ఓ జ్ఞాన ప్రకాష్, నాయుడుపేట పారెస్టు రేంజర్ రాజేంద్రప్రసాద్, సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఆర్ఎస్ సెక్షన్ అధికారి ఆమోసయ్య, ఎఫ్‌డీఓ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి



జిల్లా పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ పరిశీలకులతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించేందుకు కృషి చేయాలి
- పార్టీ శ్రేణులకు మంత్రి పెద్దిరెడ్డి దిశా నిర్దేశం

సాక్షి, తిరుపతి: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలని రాష్ట్ర మంత్రి, రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి పీఎల్ఆర్ గ్రాండ్‌లో బుధవారం చిత్తూరు, అన్నమయ్య, అనంతపురం, పుట్టపర్తి జిల్లాల పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ పరిశీలకులతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని తెలిపారు. ఇచ్చిన హామీల్లో 98.44 శాతం అమలుచేసిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు. 27 నియోజకవర్గాల్లో గడపగడపకు మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై సమీక్షించారు. రోజుకు రెండు నియోజకవర్గాల్లో పర్యటించనున్నట్లు పార్టీ నాయకులకు తెలిపారు. అందరినీ సమన్వయపరచి అత్యధిక స్థానాల్లో పార్టీ విజయం సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.

జూన్‌లో అందుబాటులోకి ఫ్లైఓవర్

తిరుపతి తుడా: ఈ ఏడాది జూన్ 15వ తేదీ నాటికి శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ అందుబాటులోకి తీసుకురావాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికా రులకు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి సూచించారు. టీటీడీ-తిరుపతి స్మార్ట్ సిటీ సంయుక్తంగా నిర్మిస్తున్న శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ నిర్మాణ పనుల పురోగతిపై బుధవారం టీటీడీ పరిపాలన భవనంలో స్మార్ట్ సిటీ ఎండీ హరిత, టీటీడీ, మున్సిపల్ అధికారులతో ఈఓ సమీక్ష నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ మే 31 నాటికి ప్రాజెక్టు మొత్తం పనులు పూర్తి చేసి, జూన్ 15వ తేదీ నాటికి అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. రోడ్ల మధ్యలో మిడియన్స్ అభివృద్ధి కోసం అవసరమైన స్థలాన్ని కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద గ్రిడ్డర్స్ పనులను త్వరగా చేపట్టాలన్నారు. జెఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎఫ్ఏసీఏవో బాలాజీ, కార్పొరేషన్ ఎస్ఈ మోహన్, ఈఈ చంద్రశేఖర్, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

అక్కచెల్లెమ్మల విధిరాత మారేలా..

- కలెక్టరేట్‌లో వైఎస్సార్ ఈబీసీ నేస్తం రెండో విడత కార్యక్రమం
- జిల్లాలో 18,229 మందికి లబ్ధి
- రూ.27.34 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ
- ఓసీల్లోని పేదలనూ ఆదుకుంటున్నారని లబ్ధిదారుల హర్షం



వైఎస్సార్ ఈబీసీ నేస్తం చెక్కును అందజేస్తున్న డీఆర్వో శ్రీనివాసరావు, సంక్షేమ అధికారి భాస్కర్‌రెడ్డి

తిరుపతి అర్బన్: వైఎస్సార్ ఈబీసీ నేస్తంతో మహిళల విధిరాతలు మారేలా సీఎం జగన్ మోహన్‌రెడ్డి సాయం చేస్తున్నారని లబ్దిదారులు ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) శ్రీనివాసరావు వైఎస్సార్ ఈబీసీ నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ప్రకాశం జిల్లా మార్కాపురంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఈబీసీ నేస్తం నిధుల విడుదల కార్యక్రమం లైవ్‌ను వీక్షించారు. అనంతరం వైఎస్సార్ ఈబీసీ నేస్తం మెగా చెక్కును మహిళలకు డీఆర్వో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అనేకవిధాలుగా సాయం చేస్తోందని చెప్పారు. సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పైసాను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకే కాకుండా ఓసీల్లో కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, క్షత్రియ, బలిజ తదితర సామాజిక వర్గాల్లోనే పేదోళ్లకు సాయం చేయాలనే ఉద్దేశ్యంలో వైఎస్సార్ ఈబీసీ నేస్తం పేరుతో ఒక్కో మహిళకు రూ.15వేలు అందిస్తున్నారని తెలిపారు. ఏడాదికి మూడు విడతల్లో రూ.45వేలు ఇవ్వనున్నారని తెలియజేశారు. 45-60 ఏళ్ల వయస్సు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. జిల్లాలో రెండో విడతలో 18,229 మందికి రూ.27.34 కోట్ల నిధులు జమ చేశారని వివరించారు.



హాజరైన మహిళలు

పేదల సీఎం జగనన్న



నా పేరు వసంత లక్ష్మి. తిరుపతి కొర్లగుంట. మా ఆయన ప్రైవేట్ స్కూల్లో టీచరు. మాకు ఇద్దరు పిల్లలు. ఎంఎస్సీ, డిగ్రీ చదువుతున్నారు. మా భర్త సంపాదన కుటుంబ పోషణకు, పిల్లలు చదువులకే సరిపోవడం లేదు. మొదటి విడత వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద అందిన రూ.15 వేలు పిల్లల చదువులకు ఉపయోగపడింది. రెండవ విడత కింద సాయం అందుతున్నందుకు ఆనందంగా ఉంది. అగ్ర వర్గాలకు చెందిన పేద మహిళలకు ఆర్థిక సాయంతో తోడ్పాటు అందిస్తున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

కుటుంబాన్ని ఆదుకుంది



నా పేరు నాగమణి. తిరుపతి నగరం చింతలచేను. ఇద్దరు పిల్లలు. నా భర్త పక్షవాతంతో బాధపడుతున్నారు. హోటల్లో పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. వైఎస్సార్ ఈబీసీ నేస్తం మొదటి విడతలో వచ్చిన డబ్బులు నా భర్త చికిత్సకు ఉపయోగ పడింది. రెండవ విడతలో రూ.15 వేలు లబ్ధి పొందుతున్నందుకు సంతోషంగా ఉంది. అమ్మ ఒడి ద్వారా కూడా లబ్ధి పొందాను. నాలాంటి వారిని ఆర్థికంగా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

రాష్ట్ర పండుగగా తిరుపతి గంగ జాతర

- సీఎం వైఎస్ జగన్ ఆదేశాలు
- తిరుపతి నగరానికే గర్వకారణం : ఎమ్మెల్యే
- 5 మహా కుంభాభిషేకం
- 9 నుంచి ప్రతిష్టాత్మకంగా తాతయ్యగుంట గంగ జాతర





ఆలయంలో జరుగుతున్న పునర్నిర్మాణ పనులు

సాక్షి, తిరుపతి: దేశంలోనే అత్యంత ప్రాచీనమైన గ్రామదేవత తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరకు రాష్ట్ర పండుగగా గుర్తింపు లభించింది. ఆ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఇకపై గంగజాతరను అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి వెల్లడించారు. వెయ్యి ఏళ్లకుపైగా చరిత్ర కలిగిన తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయాన్ని పునర్నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఎమ్మెల్యే చొరవతో రూ.16 కోట్ల దేవదాయశాఖ, టీటీడీ నిధులతో శరవేగంగా సాగుతున్న ఆలయ నిర్మాణం ఈనెల చివరికంతా పూర్తి చేయనున్నారు. వచ్చే నెల 9 నుంచి ప్రారంభం కానున్న గంగజాతరను దృష్టిలో ఉంచుకుని చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చేనెల 5న మిథున లగ్నంలో మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు. కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతిస్వామి ఈ ముహూర్తాన్ని నిర్ణయించారు.

ప్రతి రోజూ మహాలక్ష్మి మంత్ర హోమం

మహా కుంభాభిషేకం అనంతరం వచ్చే నెల 12 నుంచి ప్రతి రోజూ తాతాయ్య గుంట గంగమ్మ ఆలయంలో కనకధార స్తోత్ర పూర్వక మహాలక్ష్మి మంత్ర హోమం నిర్వహించాలని కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి ఆలయ అధికారులకు సూచించారు. అలాగే ఎమ్మెల్యే భూమన ఆధ్వర్యంలో ఏటా శ్రీగంగమ్మ జయమాల ధారణ ప్రారంభించనున్నారు.

శ్రీవారి సోదరికి నిజమైన గుర్తింపు

తిరుమలలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి చెల్లెలుగా పిలువబడే తాతాయ్య గుంట గంగమ్మను సాక్షాత్తు శ్రీవారి అపర భక్తాగ్రేసరుడు అనంతాచార్యులే స్వయంగా ప్రతిష్టించారనేందుకు చారిత్రక ఆధారాలు లభ్యమైన విషయం తెలిసిందే. అయితే నాడు పాలకులు పట్టించుకోకపోవడం, జాతరను కూడా మమ అన్న చందంగా నిర్వహించేవారు. నేడు ఎమ్మెల్యే భూమన చొరవతో తాతయ్య గుంట గంగమ్మ ప్రాశస్త్యం వెలుగులోకి వచ్చింది. అమ్మవారి ప్రాశస్త్యం గురించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం, వెంటనే స్పందించడం జరిగింది. అందులో భాగంగానే.. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముందుగా తాతయ్య గుంట గంగమ్మను రాష్ట్ర ముఖ్యమంత్రి దర్శనం చేసుకుని పూజలు నిర్వహించే సంప్రదాయానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే.

మహదానందంగా ఉంది



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించడం మహదానందంగా ఉంది. ఈ నిర్ణయం తిరుపతి నగరానికే గర్వకారణం. 1400 ఏళ్ల నాటి గంగమ్మ ఆలయం పట్ల సీఎం తీసుకున్న ప్రత్యేక చొరవకు కృతజ్ఞతలు. తిరుపతి ప్రజలు సీఎంకు ఎప్పటికి రుణపడి ఉంటారు. చరిత్రలో నిలిచిపోయేలా గంగమ్మ జాతరను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– భూమన కరుణాకరరెడ్డి,ఎమ్మెల్యే

అంగరంగ వైభవంగా పెంచలకోన బ్రహ్మోత్సవాలు

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను సమష్టి కృషితో అంగరంగ వైభవంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాపూరు మండలం పెంచలకోనలోని టీటీడీ కల్యాణ మండపంలో మే 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జరుగనున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై నెల్లూరు ఆర్డీఓ మాలోల, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌తో కలసి అధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రం నలుమూల నుంచి లక్షలాదిగా విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని శాఖల అధికారులు సమష్టిగా పని చేసి విజయ వంతం చేయాలన్నారు. త్వరితగతిన భక్తులు స్వామివారిని దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దేవస్థానం ఆవరణలోని విక్రయశాలలో ధరల బోర్డులు ఏర్పాటు చేయాలని, పోలీసుల నిరంతర పరివేక్షణ ఉండాలని, ఆహార పదార్థాలు విక్రయాలు ఒకే చోట ఉండేలా చూడాలని, వైద్య, బస్సు సౌకర్యం, తాగునీటి వసతి కల్పించాలని సూచించారు.



మాట్లాడుతున్న రాంకుమార్‌రెడ్డి, వేదికపై ఆర్డీఓ మాలోల, ఎమ్మెల్సీ మురళీధర్

150 బస్సులను నడుపుతాం

బస్సుల్లో పాత చార్జీలే వసూలు చేస్తామని, సుమారు 150 బస్సులు అన్ని ప్రాంతాల నుంచి పెంచలకోనకు నడుపుతామని డీఎం అపిల్‌కుమార్ తెలిపారు. వైద్యులు 25 మందితో నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామని వైద్యాధికారి ధర్మేంద్ర తెలిపారు. సీఐ కోటేశ్వరావు మాట్లాడుతూ సుమారు 400 మంది పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. దేవస్థానం ఈఓ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ చలువ పందిళ్లు, మరుగుదొడ్లు, స్నానపు గదులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దేవస్థానం చైర్మన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, మాజీ చైర్మన్ నెల్లూరు రవీంద్రారెడ్డి, ఏసీ శ్రీనివాసులరెడ్డి, ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వా మి, వైఎస్సార్ సీపీ నాయకులు పాపకన్నుమధుసూధన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా పెంచలకోనలో టీటీడీ నిధులతో నిర్మించిన 32 అతిథి గృహాలను వినియోగంలోకి తీసుకువచ్చేలా కృషి చేస్తానని విలేకరులతో రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్టుమెంట్లు అన్నీ ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 65,314 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 24,715 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో భక్తులు రూ.4.48 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. టికెట్లు లేని వారు స్వామిని దర్శించుకోవడానికి 18 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ప్రాణదాన ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

తిరుపతి తుడా: టీటీడీ ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు భువనేశ్వర్‌కు చెందిన శివం కాండెవ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బుధవారం రూ.10 లక్షలు విరాళంగా అందించింది. ఈ సంస్థ తరఫున ప్రతినిధి వై.రాఘవేంద్ర ఈ మేరకు విరాళం డీడీని తిరుపతిలోని పరిపాలన భవనంలో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డికి అందజేశారు.

17న ల్యాంకో ఉద్యోగాలకు జాబ్ మేళా

తిరుపతి ఎడ్యుకేషన్ : ఈనెల 17వ తేదీ ఉదయం 10గంటలకు తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వి.శ్రీలక్ష్మి తెలిపారు. శ్రీకాళహస్తిలోని ఎలక్ట్రో క్యాస్టింగ్ లిమిటెడ్(ల్యాంకో) సంస్థ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. ఐటీఐ ఉత్తీర్ణులై, 18 నుంచి 24ఏళ్లలోపు వారు అర్హులని, ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 77996 79351, 79954 79269 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

అసాధ్యాలను సుసాధ్యం చేసిన జగనన్న

- ఏళ్ల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- చంద్రగిరి వైఎస్‌ఆర్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి
- చింతగుంట పంచాయతీలో ఉత్సాహంగా మహా పాదయాత్ర



ఇటుకల తయారీలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

భాకరాపేట: అసాధ్యాలను సుసాధ్యం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందని చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. బుధవారం ఎర్రావారిపాలెం మండలం చింతగుంట పంచాయతీలో మోహిత్‌రెడ్డి గడప గడపకు మహా పాదయాత్ర కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. పార్టీ శ్రేణులు మాజీ సర్పంచ్ బాబీ, రెడ్డిచెర్ల నరేష్, భాను, బాబు, పురుషోత్తం, ఈశ్వరయ్య గజమాలతో సత్కరించారు. తొలుత సుబ్బరామాపురం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయన పాదయాత్ర ప్రారంభించారు. ప్రతి ఇంటా అపూర్వ ఆదరణ లభించింది. అభివృద్ధిని వివరిస్తూ.. పథకాలను తెలియజేస్తూ ముందుకు సాగారు. సుబ్బరామాపురంలో నెలబిడ్డను ఎత్తుకుని ముద్దాడారు. పార్థసారథికి చెందిన ఇటుకల బట్టీని పరిశీలించారు. ఈ నాలుగేళ్ల కాలంలో ప్రతి ఒక్కరి సంక్షేమానికి సీఎం జగనన్న కృషి చేశారని, మరో అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తారని తెలిపారు. చిన్నరామాపురం, చింతగుంట, ఆదిఆంధ్ర వాడ, సిద్దిగారిపల్లి, చిన్న బైలు పచార్లవాండ్ల పల్లె, పూలే వాండ్ల పల్లె, నాగినేని వారి పల్లె, ఎస్టీ కాలనీలలో ఆయన పర్యటించారు. మధ్యాహ్నం పాదయాత్ర భోజన విరామ సమయంలో పంచాయతీ పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు.

రోడ్డు నిర్మాణానికి రూ.48 లక్షల నిధులు

చింతగుంట నుంచి సబ్బరామాపురం ఎస్టీ కాలనీకి 15 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు మోహిత్‌రెడ్డి శాశ్వత పరిష్కారం చూపారు. మట్టి రోడ్డులో నిత్యం అవస్థలతో రాకపోకలు సాగిస్తున్నామని ప్రజలు విన్నవించారు. స్పందించిన మోహిత్ రెడ్డి సమస్యను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు నిర్మాణానికి రూ.48 లక్షల నిధులు ఆయన మంజూరు చేశారు. రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేయడంతో ఆ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. నాగినేనివారి పల్లెలో ఓ వృద్ధురాలని ఆదుకుంటానని భరోసా ఇచ్చారు.



చంటి బిడ్డను ముద్దు చేస్తున్నచెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

రూ.3.65 కోట్లతో అభివృద్ధి పనులు

చింతగుంట పంచాయతీ పరిధిలో రూ.3.65 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు మోహిత్‌రెడ్డి తెలిపారు. రూ.96.70 లక్షలతో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రం, పాల శీతలీకరణ కేంద్రం నిర్మాణాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ శివ లక్ష్మి, సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు రెడ్డమ్మ, వైఎస్సార్ సీపీ నెరబైలు డివిజన్ అధ్యక్షుడు గుణశేఖర్ రెడ్డి, మండల ఇన్‌చార్జి చెంగల్ రెడ్డి, గడప గడపకు మహా పాదయాత్ర పరిశీలకులు చెవిరెడ్డి రఘునాథ రెడ్డి, పార్టీ పంచాయతీ కన్వీనర్ లోకేష్, రెడ్డిచర్ల నరేష్, భాను రాయల్, జెడ్పీటీసీ సభ్యుడు కరుణాకర్ రెడ్డి, మండల కన్వీనర్ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువతి హల్‌చల్

- కారు అద్దాలు పగులగొట్టి.. మహిళపై బ్లేడుతో దాడి



చికిత్స పొందుతున్న మహిళ

గూడూరు: పట్టణంలోని వివేకానంద రోడ్డు ప్రాంతంలో మద్యం మత్తులో ఉన్న యువతి కారు అద్దాలు పగులగొట్టి, అడ్డుకున్న వారిపై దాడి చేసిన సంఘటన బుధవారం సాయంత్రం పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. వివేకానంద రోడ్డు ప్రాంతంలో జరుగుతున్న ఓ కార్యక్రమానికి తిరుపతికి చెందిన శోభన అనే మహిళ కారులో హాజరైంది. వారు ఇంట్లో ఉండగా పెద్ద శబ్దం కావడంతో బయటకు వచ్చి చూడగా, గుర్తు తెలియని ఓ యువతి మద్యం మత్తులో కారు అద్దాలు పగుల గొడుతుండడాన్ని గమనించారు. ఆమెను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆమె తన వద్ద ఉన్న బ్లేడుతో శోభనపై దాడి చేసింది. ఈ మేరకు స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో, వారు వచ్చి శోభనను చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు హల్‌చల్ చేసిన యువతిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె రెండవ పట్టణానికి చెందిన యువతిగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు 1వ పట్టణ సీఐ హజరత్‌బాబు తెలిపారు.



తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,480
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,581
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,800
రిటైల్ వెండి గ్రాము	రూ.78.80

రూ.78.70 లక్షలకు ఐపీ

తిరుపతి లీగల్ : వడమాలపేట మండలం కాయం గ్రామానికి చెందిన, ప్రస్తుతం తిరుచానూరు ఆర్‌కె కల్యాణ మండపం సమీపంలో సురేష్ ప్రొవిజన్ స్టోర్ పేరుతో వ్యాపారం నిర్వహిస్తున్న బి.సురేష్ తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.78లక్షల 70వేలకు ఐపీ దాఖలు చేసినట్టు న్యాయవాదులు సురేష్‌బాబు, వేలూరు భాస్కర్ తెలిపారు. పిటీషన్‌లోని వివరాల మేరకు.. సురేష్ 25 సంవత్సరాలుగా తిరుచానూరులో ప్రొవిజన్ స్టోర్ నిర్వహిస్తున్నాడు. వ్యాపారంలో పోటీని నిలదొక్కుకునేందుకు వినియోగదారులకు వస్తువులను అప్పుగా విక్రయించేవాడు. వ్యాపార అభివృద్ధికోసం వడ్డీలకు అప్పుగా సొమ్మును తీసుకున్నాడు. వ్యాపారంలో నష్టాలు రావడం, కోవిడ్ కాలంలో షాపులు మూసివేయడంతో తీవ్రంగా నష్టపోయినట్టు ఆయన పిటీషన్‌లో పేర్కొన్నాడు. రుణదాతలకు సొమ్ము చెల్లించలేని స్థితిలో ఐపీని దాఖలు చేసినట్టు పేర్కొన్నాడు. 23 మంది రుణదాతలను ఆయన పిటీషన్‌లో ప్రతివాదులుగా పేర్కొన్నాడు.

ఆర్టీసీ కార్గో ఏజెంట్లకు దరఖాస్తులు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ పార్సెల్ బుకింగ్ ఏజెన్సీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి అర్బన్ పరిధిలో బాలాజీ కాలనీ, అన్నారావు సర్కిల్, కర్నాలస్ట్రీట్, భవానీనగర్, శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ, ఎమ్మార్‌పల్లె సర్కిల్‌లో ఏజెన్సీ నిర్వహణకు డిపాజిట్ కింద రూ.5వేలు చెల్లించాలని పేర్కొన్నారు. ప్రతి పార్సిల్ బుకింగ్ 15 శాతం కమిషన్ ఇస్తారని తెలిపారు. తిరుచానూరు, చంద్రగిరి, రామచంద్రపురం, చిన్నగొట్టిగల్లు, యర్రావారిపాలెంలో ఏజెన్సీ నిర్వహణకు డిపాజిట్ కింద రూ. వెయ్యి చెల్లించాలని పేర్కొన్నారు. ప్రతి పార్సెల్ బుకింగ్‌కు 15 శాతం కమిషన్ ఇస్తారని తెలిపారు. సెంట్రల్ బస్ స్టేషన్ కేంద్రం నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలతో పాటు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, తదితర నగరాలకు బల్క్ బుకింగ్, డిక్కీ బుకింగ్, రూఫ్ టాప్ బుకింగ్, డీజీటీ బుకింగ్ (పది టన్నుల) వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 8074962104 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వ్యక్తి సజీవ దహనం



సుబ్రమణ్యం (ఫైల్)

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌లో బుధవారం సాయంత్రం ఇంట్లో జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ వ్యక్తి సజీవ దహనమయ్యాడు. రేణిగుంట అర్బన్ సీఐ సుబ్బారెడ్డి కథనం మేరకు... మండలంలోని తారకరామానగర్‌కు చెందిన సత్రం సుబ్రమణ్యం (50) పెరాలసిస్‌తో బాధపడుతూ ఇంట్లో మంచానికే పరిమితమయ్యాడు. అతని భార్య వరలక్ష్మి అనారోగ్యంతో కొన్నేళ్ల కిందట మృతి చెందింది. వారికి ముగ్గురు పిల్లలున్నారు. కుమారుడు మునిరాజ, సుధాకర్ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కుమార్తె తులసి హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటోంది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఆయన బెడ్‌రూములో ఒక్కడే మంచంపై పడుకుని ఉండగా ఇంట్లో ప్రమాదవశాత్తూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి ఇల్లంతా మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కల వాళ్లు గుర్తించే లోపల మంటలు ఎక్కువయ్యాయి. ఇంట్లో ఉన్న సుబ్రమణ్యం మంచంపై నుంచి లేవలేక నిస్సహాయక స్థితిలో ఉండడంతో ఆయన మంటల్లో కాలి అగ్నికి ఆహుతయ్యాడు. స్థానికులు అగ్నిమాపక అధికారులకు ఫోన్ చేయడంతో, అగ్నిమాపక వాహనం చేసుకుని మంటలను అదుపు చేసింది. విషయం తెలుసుకున్న రేణిగుంట పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మంటల్లో శరీరం మొత్తం పూర్తిగా కాలిపోయినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోటీ పరీక్షల సమాచార పత్రిక ఆవిష్కరణ



విశ్వం పోటీ పరీక్షల సమాచార పత్రికను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ పరీక్షల విభాగ డైరెక్టర్ దేవానందరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : విజయవాడలోని విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం తిరుపతి విశ్వం విద్యా సంస్థ ముద్రించిన సైనిక్, నవోదయ, పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ పోటీ పరీక్షల సమాచార పత్రికను రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగ డైరెక్టర్ డి.దేవానందరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 33 ఏళ్లుగా వివిధ పోటీ పరీక్షల్లో జాతీయ, రాష్ట్రస్థాయిలో విశ్వం విద్యాసంస్థ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధిస్తుండడం అభినందనీయమన్నారు. సైనిక్, నవోదయ, పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ వంటి పోటీ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించేలా తీర్చిదిద్దుతూ వారికి బంగారు భవిష్యత్తును అందిస్తున్నారని కొనియాడారు. విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ గత ఏడాది పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థిని సి.మహతిరెడ్డి 120 మార్కులకు 118 సాధించి ప్రథమ ర్యాంకును కైవసం చేసుకుందని, అలాగే ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో సి.పర్ణిక రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకు, సైనిక్ ఫలితాల్లో వివిధ విభాగాల్లో రాష్ట్రస్థాయిలో 4 ప్రథమ ర్యాంకులు తమ విద్యార్థులు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అపుస్మా రాష్ట్ర నాయకులు బి.రవీంద్రనాథ్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఓ.వెంకటరమణరెడ్డి, రెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన విరించి-2కే23



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో విరించి-2కే23 పేరుతో నిర్వహించిన రెండు రోజుల జాతీయ స్థాయి కల్చరల్ ఫియస్టా బుధవారం ముగిసింది. ముఖ్యఅతిథిగా వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.రజని హాజరై మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని, వారిలో దాగున్న విభిన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థినులు అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. డైరెక్టర్ ప్రొఫెసర్ పి.మల్లికార్జున, ఫ్యాకల్టీ కన్వీనర్ ఏ.సుప్రియ, కోకన్వీనర్ ప్రియదర్శిని, విద్యార్థి కన్వీనర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీరామలో ఘనంగా తరంగ్-23



బహుమతులు సాధించిన విద్యార్థులతో కళాశాల చైర్మన్, అతిథులు

తిరుపతి ఎడ్యుకేషన్ : కరకంబాడిరోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం తరంగ్-2023 పేరుతో కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జేఎన్‌టీయూఏ వీసీ ప్రొఫెసర్ జి.రంగజనార్దన ముఖ్య అతిథిగా హాజరై ఉపన్యసించారు. దైనందిన జీవితంలో సైన్స్ ప్రముఖ పాత్ర పోషిస్తోందని, సైన్సు, ఇంజినీరింగ్‌కు మధ్య సంబంధాన్ని ఉదాహరణలతో వివరించారు. సినీ గాయకులు శృతిక, సుధాన్షు సంగీత విభావరి విద్యార్థులను ఉర్రూతలూగించింది. ప్రత్యేక అతిథి, కళాశాల అధినేత మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. అనంతరం అకడమిక్‌లో మొదటి స్థానం సాధించిన విద్యార్థికి, వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల డైరెక్టర్ మన్నెం వెంకటరామిరెడ్డి, కళాశాల కార్యదర్శి మన్నెం రామసుబ్బారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యోర్లమయ్యాం!

- నెరవేరిన డీఎస్సీ-98 క్వాలిఫైడ్ అభ్యర్థుల కల
- 335 మందికి నియామకపత్రాలు అందజేత



కౌన్సిలింగ్‌కు హాజరైన 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులు

చిత్తూరు కలెక్టరేట్ : సర్కారు ఉపాధ్యాయులు కావాలన్నది వారి కోరిక. ఎంతో కష్టపడి 1998లో డీఎస్సీ పరీక్షను రాసి అర్హత సాధించారు. అయితే చంద్రబాబు పాలనలో జరిగిన మోసం వల్ల కొలువును సాధించలేకపోయారు. అప్పటి నుంచి ఎంతో మంది పాలకులు మారినప్పటికీ వారి సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. వైఎస్సార్ సీపీ సర్కారు అధికారంలోకి రాగానే పాదయాత్రలో వారికి ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీ-98 అభ్యర్థుల కలను నెరవేర్చారు.

అసలేం జరిగిందంటే...

1998లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మెగా డీఎస్సీ నిర్వహించారు. రాతపరీక్ష ఫలితాలు ప్రకటించే సమయంలో నల్గొండ, ఖమ్మం, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో శాసనసభ ఉప ఎన్నికలు వచ్చాయి. దాంతో ఈ 4 జిల్లాల రాత పరీక్షల ఫలితాలను ప్రకటించలేదు. రాష్ట్రంలో మిగతా 19 జిల్లాల పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వం నిర్ణయించిన కటాఫ్ మార్కులు సాధించిన అభ్యర్థుల సంఖ్య చాలా తక్కువని తేలింది. దీంతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కటాఫ్ మార్కులు తగ్గిస్తూ మరో ప్రత్యేక జీవో 618 విడుదల చేశారు. ఓసీలకు 45, బీసీలకు 40, ఎస్సీ ఎస్టీ దివ్యాంగులకు 35 కనీస అర్హతగా నిర్ణయించారు. ఉప ఎన్నిక పూర్తయిన తర్వాత కటాఫ్ మార్కులను తగ్గించకముందు, తగ్గించిన తర్వాత ఉన్న రెండు జాబితాలనూ కలిపి ఒకేసారి ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. ఆ ఇంటర్వ్యూల్లో కొందరు ఈ అంశాన్ని తమకు అనుకూలంగా వాడుకున్నారు. జీవో 618 ప్రకారం తక్కువ కటాఫ్ మార్కుల వచ్చినవారికి ఉద్యోగాలు వచ్చాయి. కానీ పాత జీవో ప్రకారం మెరిట్ వచ్చిన అభ్యర్థులు నష్టపోయారు. దీనిపై ఎన్నోఏళ్లుగా కోర్టులో వాదనలు జరుగుతున్నాయి. 1999లో 221 జీవో ప్రకారం మెరిట్ వచ్చిన అభ్యర్థులకు పోస్టింగులు ఇవ్వాలని ట్రిబ్యునల్ ఆదేశించింది. కానీ చంద్రబాబు ఆదేశాలతో విద్యాశాఖ 2000 సంవత్సరంలో దీనికి వ్యతిరేకంగా హైకోర్టుకు వెళ్లింది. అప్పుడు కూడా అభ్యర్థులకు అనుకూలంగానే తీర్పు వచ్చింది. దాన్ని కూడా తోసిపుచ్చిన చంద్రబాబు ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లింది. అక్కడా బాబు సర్కార్‌కు చుక్కెదురైంది. మెరిట్ అభ్యర్థులకు పోస్టింగ్ ఇవ్వాల్సిందే అంటూ సుప్రీం సైతం ఉత్తర్వులు ఇచ్చింది. కానీ టీడీపీ ప్రభుత్వం అభ్యర్థులందరికీ ఉద్యోగాలిచ్చామని, అభ్యర్థులు లేనందువల్లే కటాఫ్ మార్కులు తగ్గించామని కోర్టుకు నివేదిక ఇచ్చింది. దీనిపై 98 డీఎస్సీలో నష్టపోయిన అభ్యర్థులు మరోసారి కోర్టును ఆశ్రయించారు. ఇలా చంద్రబాబు ఇచ్చిన జీవో 618 వేలాదిమంది అభ్యర్థుల జీవితాలను చీకట్లోకి నెట్టేసింది. మెరిట్ సాధించి కూడా ఉద్యోగాలకు దూరమై మనోవ్యథకు లోనయ్యారు.

నియామక పత్రాలు అందజేత

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని క్వాలిఫైడ్ అభ్యర్థులకు చిత్తూరు డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఈవో విజయేంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కౌన్సెలింగ్‌కు తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల పరిధిలోని అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 650 మంది ఉండగా, అందులో 597 మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. నిబంధనల ప్రకారం పరిశీలనలో 553 మంది అభ్యర్థులు అర్హులుగా తేలారు. ఇందులో ఈ నెల 12వ తేదీన 350 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. మొదటి రోజు కౌన్సెలింగ్‌లో 15 మంది గైర్హాజరయ్యారు. మిగిలిన 335 మందికి వారు కోరుకున్న ప్రాంతాలకు నియామకపత్రాలను డీఈవో అందజేశారు. ఈ నెల 13న 203 మందికి కౌన్సెలింగ్ ఉంటుందని డీఈవో కార్యాలయం అధికారులు వెల్లడించారు.

భూమి ఆరోగ్యంతోనే రైతు సౌభాగ్యం



అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు

తిరుపతి రూరల్: వ్యవసాయ భూములు ఆరోగ్యంగా ఉన్నప్పుడే రైతుకు మంచి దిగుబడులు వచ్చి అధిక ఆదాయం వస్తుందని తిరుపతి జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) ప్రసాదరావు తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూసార పరీక్ష వారోత్సవాలను బుధవారం తిరుపతి రూరల్ మండలం తనపల్లిలో ఆయన ప్రారంభించారు. జిల్లాలోని పలు మండలాలకు చెందిన మండల వ్యవసాయాధికారులు, సచివాలయ వ్యవసాయ అసిస్టెంట్లకు భూసార పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం క్షేత్రస్థాయిలో మట్టి నమూనాల సేకరణ, భూమి ఆరోగ్య స్థితి అంచనా తదితర అంశాలపై నిపుణులతో శిక్షణ ఇప్పించారు. డీఏఓ మాట్లాడుతూ భూసార పరీక్షల ద్వారా రైతులు తమ భూముల ఆరోగ్యం, భూసార స్థితిని తెలుసుకుని అవసరమైన మేరకే పొదుపుగా ఎరువులను వాడుకోవచ్చన్నారు. తద్వారా అనవసర ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. 60కి పైగా మట్టి నమూనాలను సేకరించి, పరీక్ష కేంద్రానికి పంపుతామని తెలిపారు. అంతకు ముందు 'భూసార పరీక్షలు-ఎరువుల యాజమాన్యం' పుస్తకాన్ని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు ఆవిష్కరించారు. తిరుపతి వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ మదన్ మోహన్, జిల్లా భూసార పరీక్ష కేంద్రం సహాయ సంచాలకులు ప్రసాద్‌రెడ్డి, జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు భాస్కరయ్య, వ్యవసాయ కార్యాలయ ఏడీఏ ధనంజయరెడ్డి, తిరుపతి డివిజన్ ఏడీఏ మనోహర్‌బాబు, రూరల్ మండల వ్యవసాయాధికారి మమత పాల్గొన్నారు.